

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 254 పేజీలు - 08 వెల - 05/- బుధవారం 09-09-2026


# రైతుల కోసం

## నీటికి తొలి ప్రాధాన్యం: సీఎం



**ఎల్‌నినో ప్రభావం ఉన్నా 1000 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో కలుస్తోంది**

**అందులో 300 టీఎంసీలు వాడుకున్నా అద్భుతాలు సాధ్యం**

**ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం.. కాంక్లేవ్‌లో సీఎం**

**చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు**

**నేడు రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరిట దీపాల ప్రదర్శన**

అమరావతి, సెప్టెంబరు 8 : మూడేళ్లలో రూ.35వేల కోట్లతో రాష్ట్రంలోని 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి చరిత్ర సృష్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజున ఆయన మాట్లాడారు. "వంశధార, గోదావరి, కృష్ణా, తుంగభద్ర, కావేరి, పెన్నా నదులు అనుసంధానమైతే రిజర్వాయర్లన్నీ నింపుకోవచ్చు. వెలిగొండలో ఈ సీజన్‌లో 10.7 టీఎంసీలు నిల్వ చేసుకుంటున్నాం. వచ్చే ఏడాది 50 టీఎంసీలు నిల్వ చేస్తాం. పోలవరంలో ఫేజ్-2 పూర్తితో 190 టీఎంసీల వరకు నిల్వ చేసుకోవచ్చు. బొల్లాపల్లి నిర్మిస్తే 350 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. కడప జిల్లాలోని ప్రాజెక్టులతో సుమారు 100 టీఎంసీలు నింపుకొనే అవకాశం ఉంది. నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాలున్నాయి. అన్నీ పూర్తిచేసుకుంటే రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో 1,250 నుంచి 1,400 టీఎంసీలు నిల్వ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. నీళ్లు బయట నుంచి నదుల గుండా రావడం ఎంత ముఖ్యమో, మన ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చడం కూడా అంతే ముఖ్యం. భూగర్భ జలాలు పెరిగితే, విద్యుత్తుకు పెట్టే సబ్సిడీ వ్యయం కూడా తగ్గించవచ్చు. ట్రాన్స్‌మిషన్ ఖర్చులు కూడా తగ్గుతాయి." అని సీఎం తెలిపారు. 'రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గ స్థాయి అభివృద్ధి అనుసంధానం కావాలని కోరారు. "నియోజకవర్గ జీడీపీలో విజయవాడ సెంట్రల్, పాలకొల్లు, మండపేట, చిలకలూరిపేట, నెల్లూ రు సిటీ, తణుకు ముందున్నాయి. అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా నాయకుల ప్రచార శైలి ఉండాలి. విమర్శలను కూడా సానుకూలంగా మార్చుకుని ప్రజల మద్దతు కూడగట్టాలి. మనం చేస్తున్న అభివృద్ధితో ఓటుబ్యాంకు పెంచుకుందాం. డేటా సెంటర్లకు కావాల్సిన ఐదు టీఎంసీల నీరు అసలు సమస్యే కాదు. పోలవరం ఎడమకాలువ ద్వారా రోజుకు 2 టీఎంసీలు

మిగతా 2లో



# టెన్షన్.. టెన్షన్

**● ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక ● కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు ● అడ్డుకున్న పోలీసులు..?మాజీ సీఎం వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా ● కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు ● రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత ● బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు**

**● పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు, ● తదితరులు..సాయంత్రానికి విడుదల ● కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్ ● పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా?: హరీశ్‌రావు**

జవహర్‌నగర్:- అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

## తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం
- కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**తీర్మానం ప్రవేశపెట్టిన దామోదర**


స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్



## తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగ...

# భగ్గుమన్న డీఎంకే

- తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగలపై తీవ్ర వివాదం
- స్టాలిన్ దవడ పగిలిందంటూ ఎగతాళి చేశారని డీఎంకే ఆరోపణ
- తన సైగ ఉద్దేశపూర్వకం కాదంటూ 'ఎక్స్'లో విజయ్ వివరణ
- విజయ్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేందుకు స్పీకర్



# స్వచ్ఛతతో వడోదరా స్ఫూర్తి

**● వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు ● స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు ● వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ**

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు.

# పరిశ్రమలు తమ ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలి

దివిస్‌లో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై ఏపీ గ్రీన్ ఛైర్మన్ నాగబాబు సమీక్ష

**● స్థానిక వృక్ష జాతులతో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి ● నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి ● మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలి ● ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన శ్రీ నాగబాబు గారు**



పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు పరిశ్రమలు తమ గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించి, స్థానిక వృక్ష జాతులతో దట్టమైన పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ శ్రీ నాగబాబు గారు స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు సమష్టి బాధ్యతతో నిరంతరం కృషి చేసినప్పుడే పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి

మిగతాది 2లో

# సరసమైన ధరల్లో నిత్యావసరాలు

**● కిలో ఉల్లి రూ.32లకే అందించేలా ఏర్పాటులి ● 115 రైతు బజార్లు, మొబైల్ కౌంటర్ల ద్వారా విక్రయాలులి**

**● చౌకడిపోల్లో రాయితీపై కిందిపప్పు, పామాయిల్‌లి**

**● 10 శాతం నూకలు బియ్యం నమూనా దేశవ్యాప్తంగా అమలులి**

**● ఖరీఫ్ ధాన్యం సేకరణ పక్కాగా అమలులి**

**● రెండు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: బహిరంగ మార్కెట్ లో నిత్యావసర ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంచేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కిలో ఉల్లి పాయలను రూ.32లకే అందించేందుకు సిద్ధమవుతున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 115 రైతు బజార్లు, అలాగే మొబైల్ కౌంటర్ల ద్వారా ప్రజలందరికీ ఉల్లి రాయితీ ధరకే అందిస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు.

కేంద్ర పౌర సరఫరాల శాఖ, నేషనల్ కో ఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.సి.సి.ఎఫ్.) అధికారులతో జరిగిన వరుస భేటీల్లో రాష్ట్రానికి రాయితీ ధరల్లో ఉల్లిని, కందిపప్పు, పామాయిల్ ను అందించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం మంగళవారం సాయంత్రం మంత్రి ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు.

మిగతాది 2లో

# ఇరాన్‌పై గెలిస్తే పెట్రోల్ 2 డాలర్లకే: ట్రంప్

- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు



# సరసమైన ధరల్లో నిత్యావసరాలు

కేంద్ర పౌర సరఫరాల శాఖ, నేషనల్ కో ఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.సి.సి.ఎఫ్.) అధికారులతో జరిగిన వరుస భేటీల్లో రాష్ట్రానికి రాయితీ ధరల్లో ఉల్లిని, కందిపప్పు, పామాయిల్ ను అందించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన అనంతరం మంగళవారం సాయంత్రం మంత్రి ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... " ఎల్ నినో పరిస్థితుల పేరు చెప్పి, ఇతరత్ర కారణాలతో బహిరంగ మార్కెట్లో ధరలు పెరిగిన మాట వాస్తవమే. ఇలాంటి సమయాల్లో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచేలా పనిచేస్తున్నాం. ముఖ్యంగా నిత్యావసర ధరలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడాం. కేంద్ర ధరల స్థిరీకరణ నిధులు (పి.ఎస్.ఎఫ్) లతో రాయితీపై కిలో ఉల్లిపాయలు రూ.32లకే వచ్చే వారం నుంచి రాష్ట్ర ప్రజలకు అందించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని రైతు బజార్లతో పాటు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించిన విధంగా మొబైల కౌంటర్ల ద్వారా ఉల్లిపాయలను తక్కువ ధరలకే రాష్ట్రంలో విక్రయిస్తాం. ఉల్లిపాయలతో పాటు కందిపప్పును రాయితీపై 1.20 లక్షల మెట్రిక్ టన్నులు, పామాయిల్ 86,400 కిలో లీటర్ల పామాయిల్ ను రాయితీ ధరలకే రాష్ట్రంలోని 1.46 లక్షల కుటుంబాలకు చౌకధరల డిపోల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తాం. బహిరంగ మార్కెట్ ధరల కంటే 30 శాతం తక్కువ ధరలకే నాణ్యమైన నిత్యావసర సరకులు అందుకోవడం సామాన్యులకు ఊరటనిస్తుంది. కిలో కందిపప్పు ప్రతి కార్డుదారుడికి అందిస్తాం. కేంద్ర ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించుకొని రాష్ట్రానికి తగిన విధంగా సహకరిస్తున్న కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

లిరాష్ట్ర నమూనా దేశానికే మోడల్ అయిందిలి

చౌక డిపోల ద్వారా ప్రజలకు అందించే బియ్యంలో నూకలు 10 శాతానికి తగ్గించి ఇవ్వడం ద్వారా బియ్యం వినియోగం పెరుగుతుందని భావించి, ఆ విధానాన్ని రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా విజయవంతంగా అమలు చేశాం. దీన్ని కేంద్రం అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజా పంపిణీలో అమలు చేసేలా వచ్చే నెల నుంచి ఆదేశాలు ఇవ్వనుంది. బియ్యం వినియోగం పెంచడానికి రాష్ట్రంలో అనుసరించిన మార్గాన్ని కేంద్రం అమలు చేయడం రాష్ట్రానికి గర్వకారణం. 30 ఏళ్ల పీడీఎస్ బియ్యం పంపిణీ వ్యవస్థలో ఇదో పెద్ద మార్పు కింద భావించాలి. రాష్ట్ర ప్రభుత్వ సమర్ధంగా అమలు చేస్తున్న విధానం దేశమంతటికీ ఆదర్శం కావడం ఆనందంగా ఉంది. ప్రజా పంపిణీ మరింత బలోపేతం అయ్యేందుకు ఇది చక్కగా ఉపయోగపడుతుంది.

లిఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రణాళిక సిద్ధంలి

వినియోగదారులకు తక్కువ ధరలకే సరకులను అందించేందుకు ఏర్పాటు చేస్తున్న 1000 మీ మార్టులను ఎన్.సి.సి.ఎఫ్.తో అనుసంధానం అయి మొదలుపెడుతున్నాం. దీనికి సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు పూర్తయ్యాయి. మరో 130 మీ మార్టులు సిద్ధమైతే, గౌ.ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటిని రాష్ట్రమంతటా పండుగ వాతావరణంలో ప్రారంభిస్తాం. నాణ్యతమైన సరకులు, తక్కువ ధరల్లోనే అందించేలా మీ మార్టులు పనిచేస్తాయి. దీంతో పాటు వచ్చే ఖరీఫ్ నాటికి ధాన్యం సేకరణకు సంబంధించి పౌర సరఫరాల శాఖ తన ప్రణాళికను సిద్ధం చేసింది. వచ్చే ఖరీఫ్ లో రాష్ట్రంలో 35 నుంచి 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేలా సన్నద్ధం అవుతున్నాం. రికార్డు స్థాయిలో 24 గంటల్లోపే ధాన్యం సొమ్ములు అందించిన రాష్ట్ర ప్రభుత్వం, దాన్ని కొనసాగించేలా, రైతులకు అండగా నిలిచేందుకు సమాయత్తం అవుతోంది" అని చెప్పారు.

# పరిశ్రమలు తమ ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలి

ఉద్యోగులు సమష్టి బాధ్యతతో నిరంతరం కృషి చేసినప్పుడే పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలోని దివిస్ లేబొరేటరీస్ ను సందర్శించి, పరిశ్రమలో కొనసాగుతున్న గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీ నాగబాబు గారు మాట్లాడుతూ "పరిశ్రమలు తమ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను వినియోగించుకుని గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి. పెద్దగా పెరిగే స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇచ్చి మొక్కలు నాటాలి. అనుకూలమైన ప్రతి చోట మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలి. పరిశ్రమలలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలన్నింటినీ దశలవారీగా హరిత వనాలుగా మార్చాలి. నాటిన మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి" అన్నారు.

లిదివీస్ ల్యాబ్స్‌లో గ్రీన్ బెల్ట్ పరిశీలించిన శ్రీ నాగబాబు గారులి



అంతకు ముందు శ్రీ నాగబాబు గారు దివీస్ పరిశ్రమ ప్రాంగణాన్ని సందర్శించి, ఇప్పటికే అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్, మొక్కలు నాటిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే భవిష్యత్‌లో మరింత హరిత ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు ప్రస్తుతం చేపడుతున్న ప్లాంటేషన్ కార్యక్రమంతోపాటు, భవిష్యత్‌లో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించేందుకు రూపొందించిన ప్రణాళికలను శ్రీ నాగబాబు గారికి వివరించారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్‌కు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులతో కలిసి శ్రీ నాగబాబు గారు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులు చురుకుగా పాల్గొనడాన్ని ఆయన అభినందించారు. ఇప్పటి వరకు పరిశ్రమ ప్రాంగణంలో వివిధ జాతులకు చెందిన మొత్తం 25,150 మొక్కలను నాటినట్లు పరిశ్రమ ప్రతినిధులు శ్రీ నాగబాబు గారికి తెలిపారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్ ప్రతినిధులు పరిశ్రమ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలపై శ్రీ నాగబాబు గారికి వివరాలను అందించారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవల కోసం కేటాయిస్తున్న సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగం, అలాగే సీఎస్ఆర్‌లో భాగంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

# తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ సైగ... భగ్గుమన్న డీఎంకే

తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ చేసిన



ఒక సైగ తీవ్ర రాజకీయ దుమారం రేపింది. మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, సైగలపై డీఎంకే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది 'బాడీ షేమింగ్' కిందకే వస్తుందని ఆరోపిస్తూ ఆ పార్టీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ సమయంలో 'మిసా' చట్టం కింద స్టాలిన్ అరెస్ట్ అయిన ఉదంతాన్ని ప్రస్తావించారు. ఈ క్రమంలో తన కుడి అరచేతిని దవడకు ఆనించి మాట్లాడటం వివాదాస్పదమైంది. అత్యవసర పరిస్థితి కాలంలో పోలీసుల దాడిలో స్టాలిన్ దవడ పగిలిందన్న విషయాన్ని ముఖ్యమంత్రి ఎగతాళి చేశారని డీఎంకే నేతలు ఆరోపించారు. ముఖ్యమంత్రి విజయ్ వ్యాఖ్యలను సభాపతి రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ డీఎంకే ఎమ్మెల్యేలు స్పీకర్ జేసీడీ ప్రభాకర్ చాంబర్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు పంపాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇతరుల శారీరక స్థితిని హేళన చేయడం అత్యంత దారుణమని సీపీఎం నేత పి. షణ్ముగం ఖండించారు.

ఈ వివాదంపై ముఖ్యమంత్రి విజయ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రసంగించే క్రమంలో అనుకోకుండా నా బాడీ లాంగ్వేజ్ అలా వచ్చింది తప్ప, అది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదు. వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచే ఉద్దేశం నాకు లేదు. దీనిని హేళనగా భావించవద్దని కోరుతున్నాను" అని ఆయన తన పోస్టులో వివరణ ఇచ్చారు.

అయితే, ముఖ్యమంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించేందుకు స్పీకర్ ప్రభాకర్ నిరాకరించారు. మరోవైపు, స్టాలిన్‌ను అసలు 'మిసా' కింద అరెస్ట్ చేయలేదని, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారనే కారణంతోనే అరెస్ట్ చేశారని రాష్ట్ర మంత్రి సీటీఆర్ నిర్మల్ కుమార్ వాదించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అసెంబ్లీ తన గౌరవ మర్యాదలను కాపాడుకుంటూ నడుస్తోందా? అని ఎం.కె. స్టాలిన్ ప్రశ్నించారు.

# రైతుల కోసం నీటికి తొలి ప్రాధాన్యం: చంద్రబాబు

తీసుకెళ్లే అవకాశం ఉంది. డేటా సెంటర్ల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉంది. 15-20 రంగాల్లో జీఎస్డీపీని పెంచేలా నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి ఈ ఏడాది 1000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా వెళ్లింది. అందులోంచి 300 టీఎంసీలు వాడుకున్నా అద్భుతాలు సృష్టించవచ్చు." అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు రావాలి..

"సంపద సృష్టికి డబ్బులు లేవని కూర్చుంటే సరిపోదు. ఆలోచన చేస్తే పరిష్కారం లభిస్తుంది. రాష్ట్రాన్ని దేశంలో నం.1గా అభివృద్ధి చేయడమే లక్ష్యం. ఆలోచన మారితే ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేసుకోవచ్చు. కుప్పం సమీపం నుంచి వెళ్తున్న జాతీయ రహదారికి దగ్గర్లో ఓ పారిశ్రామిక ప్రాంతాన్ని సృష్టించాం. రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ప్రాజెక్టులు అంతే వేగంగా ఏర్పాటయ్యేలా చూడాలి. 'పౌరసేవలు అందించడంలో కొన్ని నియోజకవర్గాలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. అన్ని నియోజకవర్గాలూ ఉత్తమ కార్యాచరణ పద్ధతులను అమలు చేయాలి. ఏడాదికి రూ.1000 కోట్ల ఆదాయం వస్తున్నా వదులుకుని, ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తున్నాం. ఎక్కడైనా ఉచిత ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోండి.."

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం..

"ఎల్‌నినో వల్ల రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అంతా కలిసి దీనిని సమర్థంగా ఎదుర్కొందాం. రాష్ట్రంలో ఇప్పటిదాకా 54 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్లలో గత ఏడాది ఇదే సమయానికి 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి మాత్రం 530 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయి. కొన్ని జిల్లాల్లో వేయాల్సిన దానికంటే ఎక్కువగా పంటలు వేశారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 177 శాతం పంటలు వేశారు. తిరుపతి జిల్లాలో 158 శాతం, కోనసీమలో 103 శాతం, పశ్చిమ గోదావరిలో 99 శాతం పంటలు వేశారు. మార్కాపురంలో 21, పోలవరంలో 20, ప్రకాశం జిల్లాలో 12 శాతం మాత్రమే పంటలు వేశారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తునే సాగు చేశారు. గోదావరి నీటిని తరలించి కృష్ణా డెల్టాలో పంటలను కాపాడుకోగలిగాం. పట్టిసీమ ద్వారా 36 టీఎంసీల నీరు ప్రకాశం బ్యారేజీకి తరలించాం. ఈ సీజన్‌లో ఈ ప్రాంతానికి మరో 71 టీఎంసీలు అవసరం. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యం. పశువులకు కూడా నీటి కొరత లేకుండా కాపాడుకుంటాం. పరిశ్రమలకు లోటు లేకుండా కార్యాచరణ చేపడతాం. ఉద్యాన పంటలూ కాపాడుకునేలా చర్యలు చేపట్టాం. పంటల బీమా పెద్దఎత్తున చేశాం. వర్షాభావంతో కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల్లోని రైతులు పూర్తిగా నష్టపోయారు. వైవిధ్య పంటల దిశగా అవగాహన కల్పించాలి. రాష్ట్రంలో ప్రతి ఎకరంలో సాగు చేసేందుకు పీఎండీఎస్ విధానం చేపట్టాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు ఆస్కారం ఉంది. 25 లక్షల ఎకరాల్లో ఈ తరహా విధానం అనుసరించాలని రైతులకు పిలుపునిస్తున్నా. వివిధ నియోజకవర్గాల్లో పీఎండీఎస్ విధానంలో విత్తనాలను చల్లించాలని కోరుతున్నా. గత పాలకులు సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలోకి వాస్తవాలను తీసుకెళ్లి కౌంటర్ చేయాలి. ప్రజల్లో విశ్వాసం కల్పించేలా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌ఛార్జి మంత్రులు నిరంతరం మాట్లాడాలి. సాధారణ పరిస్థితులు వచ్చే వరకూ ఎల్‌నినోపైనే కేంద్రీకరించాలి" అని సీఎం పిలుపునిచ్చారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరిట దీపాల ప్రదర్శన

టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసి బుధవారంతో మూడేళ్లు పూర్తి అవుతాయని మంత్రి లోకేశ్ తెలిపారు. "అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి రోడ్డు మార్గంలో ఆయనను నాడు కోర్టుకు తీసుకెళ్లారు. 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో బంధించారు. ఆయనకు కోర్టు, ఈడీ క్లీన్ చిట్ ఇచ్చాయి. రేపు 'నిజం గెలిచింది' పేరుతో పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ లెవల్ లో 53 దీపాలు వెలిగిద్దాం. చంద్రబాబు అక్రమ అరెస్టును బ్లాక్ డే గా పాటిద్దాం."

# స్వచ్ఛతతో వడోదరా స్ఫూర్తి

అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# ఇరాన్‌పై గెలిస్తే పెట్రోల్ 2 డాలర్లకే: ట్రంప్

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

# టెన్షన్.. టెన్షన్

కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

భారీగా పోలీసుల మోహరింపు

కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.

గజ్వేల్‌లో సైతం ఉద్రిక్తత

కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి డప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు రక్షణగా వెళ్తున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు.

? కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేల అడ్డగింత

ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లికి బయల్దేరడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్తున్న వారిని హకీంపేట, బొల్లారం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, పద్మారావుగౌడ్, కాలేరు వెంకటేశ్, గూడెం మహిపాల్‌రెడ్డి తదితరులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాణిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు విషయం తెలియడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్లకు తరలివచ్చారు.

హకీంపేట వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పర్యవేక్షణలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి నివాసం వద్ద భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అరెస్టు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

?ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి : కేటీఆర్

ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు, అరెస్టులకు పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించిన తీరును ఖండించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. హామీల అమలుపై అసెంబ్లీలో ప్రశ్నించాలని కేసీఆర్ తమకు సూచించారని తెలిపారు. సోమవారం అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్నారని, మంగళవారం కేసీఆర్‌ను కలిసేందుకు ఎర్రవెల్లి వెళ్తుంటే అడ్డుకున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ

## సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలి.

పింఛన్ దరఖాస్తు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్.

దరఖాస్తుదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్ రాజకుమారి గణియా.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా, పారదర్శకంగా, సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట 1, 2 స్వర్ణ వార్డులను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని స్వయంగా పరిశీలించి, దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఒక్కో దరఖాస్తు ప్రక్రియకు పడుతున్న సమయం, దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, అర్హత ప్రమాణాలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ పథకం ప్రయోజనం అందేలా సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## నాయకత్వానికి కొత్త దిశ.. టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్

● రెండో రోజు శిక్షణలో పాల్గొన్న కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మరియు తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు. ●

క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేలా దిశానిర్దేశం







ఆదోని (పల్లె వెలుగు): తెలుగుదేశం పార్టీ నాయకత్వాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈ శిక్షణ తరగతుల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. రెండో రోజు శిక్షణలో నాయకత్వ లక్షణాలను మెరుగుపరుచుకోవడం, ప్రజలతో సత్సంబంధాలను బలోపేతం చేసుకోవడం, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయడం, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడం తదితర అంశాలపై శిక్షణ అందించారు. ప్రజా సమస్యలపై వేగంగా స్పందించే విధానం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయడం, నాయకత్వంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు.

**క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలం**

లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ ద్వారా నాయకులు, కార్యకర్తల్లో నాయకత్వ నైపుణ్యాలను మరింత పెంపొందించడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన దిశానిర్దేశం లభించిందని గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కార్యకర్తలతో సమన్వయంతో పనిచేసినప్పుడే పార్టీ మరింత బలపడుతుందని ఆమె అన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

### పింఛన్ కోసం ఎదురుచూపులు.. ద

## నిబంధనలతో పేదలకు తిప్పలు!





ఆదోని (పల్లె వెలుగు): కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం విధించిన నిబంధనలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఎం నాయకులు అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేలా కొత్త పింఛన్ల నమోదుకు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆదోని పట్టణ జనరల్ బాడీ సమావేశం సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, తిప్పన్న మాట్లాడారు. కొత్త పింఛన్ల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ, అమలు చేస్తున్న నిబంధనల కారణంగా అర్హులైన పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి అర్హుడికి సులభంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. నిబంధనలను సరళీకరించడంతో పాటు దరఖాస్తు గడువును నెలాఖరు వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన ఏ ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, నాగరాజు, కృష్ణమూర్తి, నాగేంద్ర, మక్బూల్ బాను, మల్లయ్య, రాజు, సంజయ్, మోహన్, ఇక్బాల్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో జర్నలిస్టుల పై పెట్టిన అక్రమ కేసులు

# ఎత్తివేయాలి.సిపిఎం డిమాండ్.

**అర్ధరాత్రి దొంగలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు అరెస్టును ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి.**

**అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలి.**




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల జిల్లాలో ఐ న్యూస్ రిపోర్టర్స్ ని అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్లి దొంగలను అరెస్టు చేసినట్లుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా. నరసింహ, కె. మహమ్మద్ గౌస్, పి. వెంకట లింగం, డి. మౌలాలి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో మంత్రి ఫరూక్ కుమారుల మీద షాడో మంత్రులు అంటూ వార్తలు ప్రసారం చేసారని అనుచరులు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి సమయంలో ఉగ్రవాదులను,దొంగలను అరెస్ట్ చేసినట్లుగా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురయ్యే విధంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా ప్రతినిధులను పూర్తిగా ఇబ్బందులు గురి చేసే విధంగా పోలీస్ చర్యలను వారు తప్పు పట్టారు పత్రికా స్వేచ్ఛను మీడియా స్వేచ్ఛను హరించే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఏమైనా తప్పుడు కథనాలని ప్రసారం చేస్తే ప్రజాస్వామ్య బద్ధంగా డెఫినేషన్ వేయొచ్చు కానీ వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ కుమారులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు ఇస్తే.. న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి అక్రమ కేసులు పెట్టి జర్నలిస్టులను లొంగదీసుకోవాలని చూస్తే అది కుదరదని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నంద్యాల టూ టౌన్ పోలీసులు దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, రిపోర్టర్స్ పై బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. అంతటితో ఆగకుండా రిపోర్టర్స్ పై నాన్ బెయిల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. రిపోర్టర్ల పై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టులందరిని కలుపుకొని ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

# వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

● హంద్రీనీవాలో 3 ప్రాంతాల్లో నిమజ్జనానికి అవకాశాలు: మంత్రి టీజీ భరత్ ● ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించిన మంత్రి టీజీ భరత్



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో హంద్రీనీవాలో వినాయక నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుంకేసులలో నీటి లభ్యత లేని కారణంంగా కె.సి కెనాల్‌కు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయన తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరిస్తూ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీన అధికారులు నిర్వహించిన సమీక్షలో ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే హంద్రీనీవాకు నీరు తీసుకునేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. అప్పుడు కూడా చిన్న విగ్రహాలు మాత్రమే హంద్రీనీవాలో నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశం తర్వాత.. ఇప్పటి నుండి మరో 12 లేదా 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో పాటు పెద్ద విగ్రహాలు సైతం నిమజ్జనం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెప్పినట్లు మంత్రి తెలిపారు. హంద్రీనీవాలో మూడు రోజుల పాటు అంటే వినాయకుడిని ప్రతిష్టించిన తర్వాత 5వ రోజు, 7వ రోజు, 9వ రోజు నిమజ్జనం చేసుకునేందుకు ఇప్పుడున్న పరిస్థితిని బట్టి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో ప్రధానంగా 5వ రోజు, 7వ రోజు నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని.. నిమజ్జనం చేయడానికి అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపారన్నారు. 9వ రోజు నిమజ్జనానికి ఎంతమేర అనుకూలత ఉంటుందో ఇప్పుడున్న పరిస్థితిని బట్టి ఖచ్చితంగా అంచనా వేయలేమన్నారు. నిమజ్జనం చేసేందుకు నన్నూర్ టోల్‌గేట్, తడకనపల్లె, ఉలిందకొండ వద్ద హంద్రీనీవాలో ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతాన్ని వినాయక నిమజ్జన కమిటీ వారు ఎంపిక చేసి చెబితే.. గత కొన్ని సంవత్సరాలుగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ తరుపున నిమజ్జన సమయంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారో అదేవిధంగా ఈ ఏడాది కూడా నిమజ్జన కమిటీ ఎంపిక చేసిన ప్రాంతంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ తరుపున పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తామన్నారు.

ప్రజలు ఒక అడుగు లేదా అడుగున్నర మట్టి విగ్రహాలు మాత్రమే ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు. చిన్న విగ్రహాలైతే ఇంటి వద్దనే నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం వినాయక నిమజ్జన కమిటీ, అధికారులు ఎంపిక చేసిన ప్రాంతంలో నిమజ్జనం చేస్తామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇక వర్షాలు కురిసేందుకు దేవాదాయ శాఖ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా వరుణ యాగం చేయాలని క్యాబినెట్ సమావేశంలో చర్చించామని, కర్నూలులో గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహిస్తామన్నారు. వర్షాలు కురిసి సుంకేసులకు నీరు వస్తే కెసి కెనాల్‌కు నీరు వస్తుందన్నారు. అప్పుడు అక్కడ నిమజ్జనం చేసుకోవచ్చన్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితిని బట్టి కె.సి కెనాల్‌లో నిమజ్జనం చేసేందుకు అవకాశం లేదన్నని అర్థం చేసుకొని సహకరించాలని ఆయన ప్రజలను కోరాను.

# శుభకార్యాలకు అనుమతి తప్పనిసరి

● అధిక జనంతో కార్యక్రమాల నిర్వహణకు 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలి ● చెత్త సేకరణకు ప్రత్యేక ట్రాలీ ఏర్పాటు చేస్తాం ● త్వరలో మరో 10 ఈ-ఆటోలు రాక ● కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇతర శుభకార్యక్రమాలను నిర్వహించే ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు తప్పనిసరిగా 48 గంటల ముందు రూ.2,000 రుసుము చెల్లించి నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందాలని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. కార్యక్రమాల సమయంలో పెద్ద మొత్తంలో ఉత్పత్తయ్యే చెత్తను సక్రమంగా సేకరించేందుకు ప్రత్యేక ట్రాలీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనుమతి, ఇతర పూర్తి వివరాల కోసం 9849908486 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మంగళవారం వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అయ్యప్పస్వామి ఆలయం వెనుక టీ దుకాణం వద్ద వ్యర్థాలను కేసీ కెనాల్‌లో వేస్తుండటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనిని ఆదేశించారు.

అనంతరం గ్రీన్ పార్క్ వద్ద బండ్‌పై నిర్మించిన సీసీ రహదారిని కమిషనర్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందిని సూచనలు చేశారు. అదేవిధంగా వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోల పార్కింగ్, చార్జింగ్, చెత్త బదిలీ ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. ప్రస్తుతం 30 విద్యుత్ ఆటోలు వినియోగంలోకి వచ్చాయని, త్వరలో మరో 10 ఆటోలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వీటి ద్వారా చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. కర్నూలు నగరంలో శుభకార్యాలు, ఇతర భారీ కార్యక్రమాల సమయంలో పెద్ద మొత్తంలో చెత్త ఉత్పత్తి అవుతున్నందున ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు ముందస్తుగా నగరపాలక సంస్థకు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమ సమయంలోనే చెత్తను సేకరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు, ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీఈ నరేష్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, జిలానీ, శివశంకర్, ఫరూక్, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యం.

**● నిరక్షరాస్యత నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలి. ● అక్షరజ్ఞానంతో ఆత్మగౌరవం, సాధికారత సాధ్యం. ● మహిళలు సహా ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలి. ● జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో 100 శాతం నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు సమిష్టి కృషితో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్షరజ్ఞానం కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తిలో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, సాధికారతను పెంపొందించి మెరుగైన జీవనానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎవరూ విద్యకు దూరంగా ఉండకుండా, చదువులో వెనుకబడిన ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం పొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్వే ద్వారా జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది: నిరక్షరాస్యులను గుర్తించామని, వారందరినీ మూడు సంవత్సరాల కాలంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఉల్లాస్" (అక్షరాంధ్ర) కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఫేజ్-1లో లక్ష మందికి పైగా అభ్యాసకులకు అక్షరాస్యత అందించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించామని పేర్కొన్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని "అక్షరాంధ్ర ఫేజ్-2"ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ దశలో సుమారు 1.12 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని, మిగిలిన లక్ష్యాన్ని వచ్చే ఏడాది ఫేజ్-3లో పూర్తి చేసి జిల్లాను 100 శాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. ముందుగా అక్షరాలను గుర్తించడం, బోర్డులు, బస్సుల పేర్లు చదవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను అలవర్చుకోవడంతో చదవడం, రాయడంపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. కేవలం సంతకం చేయడం వరకు పరిమితం కాకుండా అక్షరాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకు ఫారాలు నింపడం, ఏటీఎం ద్వారా నగదు తీసుకోవడం, యూపీఐ చెల్లింపులు, మొబైల్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం వంటి దైనందిన అవసరాలకు ప్రాథమిక అక్షరాస్యత ఎంతో అవసరమని తెలిపారు. అక్షరజ్ఞానం లేకపోవడం వల్ల ఎవరూ మోసపోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరికీ కనీస అక్షరాస్యత కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు.

అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంఘాల్లోని చదువుకున్న సభ్యులు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చదువుకున్న వారిని వాలంటీర్లుగా ఎంపిక చేసి అభ్యాసకులకు బోధన అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాలంటీర్లకు 8 పాఠాలతో కూడిన పుస్తకాలను అందించడంతో పాటు అభ్యాసకుల కోసం 32 సాధన పత్రాలు, 4 మోడల్ ప్రశ్నపత్రాలను రూపొందించినట్లు చెప్పారు. పగటిపూట పనులకు వెళ్లే వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనుకూలమైన సమయంలో రోజుకు అరగంట నుంచి గంట వరకు బోధన అందించాలని సూచించారు. వచ్చే మార్చిలో నిర్వహించే తుది పరీక్షలకు అభ్యాసకులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని, పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు బొమ్మలు-అక్షరాలను జత చేయడం, సరళమైన కూడికలు, తీసివేతలు వంటి సులభమైన పద్ధతుల్లో అభ్యాసం కల్పించాలని తెలిపారు. డిజిటల్ హాజరు నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను వినియోగించాలని సూచించారు.

నేర్చుకోవాలనే తపన, ఆసక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని, పిల్లలను చూసి తల్లిదండ్రులు, తోటివారిని చూసి ఇతరులు స్ఫూర్తి పొంది చదువుకున్న అనేక ఉదాహరణలు ఉన్నాయని









కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి "ప్రతి వ్యక్తి అక్షరాస్యుడు - ప్రతి కుటుంబం అక్షరాస్య కుటుంబం" అనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్న అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, టీమ్ సభ్యులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన బృందాలకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఓ జనార్దన్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీపీఓ ఫణికుమార్ నాయక్ తదితర అధికారులు పాల్గొని అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు.

# ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని కలిసిన,

-ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి,,



ఎమ్మిగనూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 8 కర్నూలు పట్టణంలో జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ని వైఎస్సార్సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గౌరవప్రదంగా కలిసి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రత్యేకంగా గోనెగండ్ల, నందవరం మండలాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలు, వాటిపై సంబంధిత అధికారులు తీసుకుంటున్న చర్యలు, అలాగే ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ ని కోరారు. అదేవిధంగా వైఎస్సార్సీపీ పార్టీ శ్రేణులపై గోనెగండ్ల మండలం, నందవరం మండలం పోలీస్ శాఖ కొందరు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయని, కొన్ని సందర్భాల్లో సరైన విచారణ లేకుండానే కేసులు నమోదు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పూర్తి వివరాలతో ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. పోలీస్ శాఖ రాజకీయ పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంగా శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగి ఉందని, కేసులు నమోదు చేసే ముందు వాస్తవాలను పూర్తిగా పరిశీలించి, ఇరుపక్షాల వాదనలు తెలుసుకుని చట్టప్రకారం వ్యవహరించేలా సంబంధిత మండలాల సీఐలు, ఎస్ఐలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రాజీవ్ రెడ్డి కోరారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అక్రమ కేసులు నమోదు కాకుండా సమగ్ర విచారణ అనంతరం మాత్రమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్లారు.


నియోజకవర్గం లో బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, గ్రామాల్లో ఎక్కడ చూసినా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తున్నాయని రాజీవ్ రెడ్డి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాల వల్ల కుటుంబాలు, యువత తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ప్రజలకు భద్రత కల్పించడం, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, రాజకీయాలకు అతీతంగా పోలీస్ వ్యవస్థ నిష్పక్షపాతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ గారిని ఎర్రకోట రాజీవ్ రెడ్డి కోరారు.

# అవార్డు గ్రహీతకు సన్మానం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 8: నంద్యాల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ



అవార్డు పొందిన డాక్టర్ ఎం హాజీ భాషను బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ అబ్దుర్ రాఫీ, మండల విద్యాశాఖ అధికారిణి యశోద, ఉపాధ్యాయులు సిబ్బంది శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో పిజిటి కెమిస్ట్రీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హాజీ భాష విద్యా రంగానికి విద్యార్థుల అభ్యున్నతి కోసం పడుతున్న శ్రమను సేవలను గుర్తించి ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. హాజీ భాషకు ఈ అవార్డు రావడం మండల విద్యాశాఖ కి గర్వకారణం అని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# జాతీయ కీటక జనిత వ్యాధులపై జాగ్రత్త వహించండి

వైద్యాధి కారి ప్రశాంతి టి.నరసింహా రెడ్డి సబ్ - యూనిట్ ఆఫీసర్

కాశినాయన సెప్టెంబర్ 8 ( పల్లె వెలుగు ):ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నరసాపురం నందు




వైద్యాధికారి డా.ప్రశాంతి ఆధ్వర్యంలో ఆశా డే మీటింగ్ జరపడం జరిగింది. ఈ మీటింగ్ నందు వైద్యాధికారి గారు మాట్లాడుతూ అన్ని ఇండికేటర్స్ పైన రివ్యూ చేశారు, ఎం సి హెచ్ , ఈ హెచ్ ఆర్ , ఈసీ , లు అన్ని కూడా 100 % ప్రతి ఏ ఎన్ ఎం ఉ ఎం ఎల్ హెచ్ పి లు సాధించాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి పోరుమామిళ్ల లో యే విధంగా అయితే రివ్యూ చేసారో,ప్రతి ఒక్కరిని కూడా అదే విధంగా రివ్యూ జరుగుతుంది అని, విలేజ్ హెల్త్ క్లినిక్ కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి గారు పర్యవేక్షణ ఉంటుందని, సిబ్బంది అందరు, మీ గ్రామాలల్లో అప్రమత్తం గా వుంటూ మీ విధులను సక్రమంగా నిర్వహించాలని డాక్టర్ ప్రశాంతి, వైద్య సిబ్బంది కి తెలియచేసారు,.ఈ నెల 11వ తేదీ నుంచి 24 వరకు జరిగే జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమం ప్రోగ్రామ్ హౌస్ శ్రీ హౌస్ గృహాలు సర్వే నిర్వహించి ప్రతి రోజు రిపోర్ట్ పంపాలని తెలియచేసారు,మన పీ హెచ్ సి ని,ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి అందరూ కృషి చెయ్యాలని కోరటం జరిగింది. ఈ మీటింగ్ నందు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీ టి .నరసింహారెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని,మలేరియా, ఫైలేరియా,డెంగ్యూ,చికున్ గునియా, మెదడు వాపు జ్వరాల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించటం జరిగింది. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పకుండా ప్రతి ఇల్లు పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బంది తెలియచేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ , సుబ్బారాయుడు, పి హెచ్ ఎన్ , హుస్సేణమ్మ,సూపర్వైజర్ డా . బాలయ్య,నిర్మల హెచ్.ఏ ,చంద్రశేఖర్, ఎం ఎల్ హెచ్ పి 'లు , ఏ ఎన్ ఎం లు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యతోనే బంగారు భవిష్యత్తు: న్యాయమూర్తి లీల వెంకట శేషాద్రి

**☛కల్లూరు జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం**

**☛పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన న్యాయమూర్తి**

**☛'మట్టి వినాయకులే ముద్దు' పోస్టర్ ఆవిష్కరణ; మధ్యాహ్న భోజనం పరిశీలన**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో విద్యతోనే సమాజంలో సముచిత స్థానం, ఉజ్వల భవిష్యత్తు లభిస్తాయని డీఎల్ఎస్ఏ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి లీల వెంకట శేషాద్రి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి చదువు విశిష్టతను, నిత్యజీవితంలో విద్య ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ఎలా రాణించాలనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు.



అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. రాబోయే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని 'మట్టి వినాయకులే ముద్దు' అవగాహన పోస్టర్‌ను న్యాయమూర్తి ఆవిష్కరించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి ప్రతిమలనే పూజించాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. ఆహార నాణ్యత చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు.

కార్యక్రమంలో కల్లూరు మండల విద్యాశాఖ అధికారి (వీజూ), పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# తొట్టిగారిపల్లి పీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర డిస్ట్రిక్ట్ అసెస్‌మెంట్

బద్వేల్, సెప్టెంబరు 8 (పల్లె వెలుగు)బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య






కేంద్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ అసెస్‌మెంట్ బృందం సభ్యులు సందర్శించి పరిశీలించారు. అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా చేపడుతున్న సర్వే, మాతా శిశు సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. హోమ్ బేస్డ్ నియోనేటల్ కేర్ కిట్ ప్రాముఖ్యతను ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి వివరించారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సులోచన, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.ద

# నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన నందీశ్వరుడికి వేద



పండితులు ప్రదోషకాలంలో విశేష అభిషేకాలు, అర్చనల పూజలను వేదోక్తంగా చేశారు. మంగళవారం శ్రావణ బహుళ త్రయోదశి నంది ప్రదోషం సందర్భంగా దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో విశేషాభిషేకాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలోనే గణపతిపూజ, ద్రవ్య పూజ పీఠార్చన,గంధం, పలురకాల చూర్ణాలతో అభిషేకించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## కొత్త వ్యవసాయ సాంకేతికతలపై
# అవగాహన పర్యటన..

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక.. గడివేముల మండలంలో గల జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారి సహకారంతో గడివేముల ఎఫ్ పి ఓసభ్యుల కోసం కొత్త వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన పర్యటనను నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా యాగంటిపల్లె శాస్త్రవేత్తలు శ్రీ రవి గౌడ్ మరియు శ్రీ రమణయ్య విత్తన శుద్ధి కేంద్రం మరియు కస్టమ్ హైరింగ్ సెంటర్ గురించి రైతులకు వివరించారు. వాటి విధులు, నిర్వహణ ప్రక్రియలు మరియు రైతులకు కలిగేప్రయోజనాలను స్పష్టంగా వివరించారు. అదేవిధంగా, రైతులకు వివిధ వ్యవసాయ ఆధారిత మరియు అనుబంధ కార్యకలాపాలపై సంక్షిప్త సమాచారం అందించడంతో పాటు,




ప్రత్యక్ష ప్రాయోగిక అవగాహన కల్పించారు. వీటిలో పాలీహౌస్ గొర్రెల పెంపకం యూనిట్ ,సమగ్ర వ్యవసాయ విధానం (మేకల పెంపకం ం కోళ్ల పెంపకం), దేశీయ పశువుల యూనిట్ వర్మీకంపోస్టింగ్ యూనిట్లు షేడ్ నెట్‌లు ,పుట్టగొడుగుల ,పెంపకం యూనిట్ ,మరియు కోళ్ల పెంపకం యూనిట్ ఉన్నాయి.ఈ అవగాహన పర్యటన ద్వారా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అనుబంధ జీవనోపాధి కార్యకలాపాలు మరియు వ్యవసాయ ఉత్పత్తుల విలువ ఆధారిత అవకాశాలపై ప్రాయోగిక జ్ఞానాన్ని పొందారు.ఈ కార్యక్రమం సందర్భంగా గడివేముల రైతు సభ్యులు తమకు ఈ విలువైన అవకాశాన్ని కల్పించి, వారి అభ్యాసం మరియు అభివృద్ధికి సహకరించిన జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం బృందానికి మరియు నవయూత్ అసోసియేషన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మహానంది ఆలయ ఉద్యోగి మృతి



మహానంది, పల్లె వెలుగు మహానంది దేవస్థానంలో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న అంకి నాగరాజు అనే ఉద్యోగి అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారన్నారు. అలయ ఈవో శ్రీనివాసరెడ్డితో పాటు, అధికారులు, సిబ్బంది ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గడివేముల కస్తూరిబా,మోడల్ స్కూల్లో విద్యార్థుల్లో
# నైపుణ్యాభివృద్ధికి వ్యక్తిత్వ తగువాటిపై అవగాహన కార్యక్రమం.

### ఏపీఎంఎస్ గడివేములలో విద్యార్థులకు ప్రేరణాత్మక మార్గదర్శనం

గడివేముల పల్లె వెలుగు దినపత్రిక నంద్యాల, సెప్టెంబర్ 08: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులు విద్యతో పాటు జీవితంలో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేలా ప్రోత్సహించేందుకు ఏపీఎంఎస్ గడివేములలో ప్రత్యేక వ్యక్తిత్వ వికాసం మరియు వృత్తి మార్గదర్శక కార్యక్రమాన్ని గడివేములలో ఉన్న మోడల్ స్కూల్ , కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సెట్కూర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. కె. వేణుగోపాల్ నాయకత్వంలో యువజన సంక్షేమ శాఖ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రేరణాత్మక ప్రసంగకర్త శ్రీమతి జ్యోతిర్మయి విద్యార్థులకు భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పిస్తూ, తమకు నచ్చిన రంగాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.




విజయం సాధించాలంటే ప్రతిభతో పాటు పట్టుదల, క్రమశిక్షణ మరియు నిరంతర సాధన అవసరమని తెలిపారు. విద్యార్థులు తమలోని భయాలను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉన్నత విద్య, వివిధ వృత్తి రంగాలు మరియు భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు అవసరమైన సూచనలు అందించారు.కార్యక్రమంలో కె.గోవింద్, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూబియా ఆఫ్రిన్, మోడల్ స్కూల్ పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు,సెట్కూర్ సిబ్బంది శ్రీ ఎం. కళానిధీష్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓ యువతా గమ్యం నీదే గెలుపు నీదే

పల్లె వెలుగు:లేవండి! మేల్కొనండి !! గమ్యం చేరేవరకు విశ్రమించకండి!!! స్వామి వివేకానందబికష్టాలు నిన్ను ఆపలేవు పరిమితులు నిన్ను బంధించలేవు నీపట్టుదలే
నీకు దశా నిర్దేశం అవుతుంది. బిడాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్
ఓ యువతా ఆకాశమే హద్దు అనుకోకు ఆ ఆకాశాన్ని దాటి ఎదగడం నేర్చుకో.సరిహద్దులు నిన్ను ఆపలేవు నీ నమ్మకాన్ని అవి చెరుపలేవు.కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి.మీ గమ్యం వైపు సాగే ప్రయాణంలో నిరంతర శ్రమ పట్టుదల ఉంటే గెలుపు మీ సొంతమవుతుంది అన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వాఖ్యను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి.అడుగు ముందుకేయి అలసటను పక్కన బెట్టు ఓటమి ఎదురైన సరే పోరాడే గుణాన్ని నమ్ముకో.ధైర్యం ఆత్మవిశ్వాసమే నీ పెట్టుబడులు కావాలి.పరిమితులుఅనేవి మనసులోనే ఉంటాయి ప్రయత్నిస్తే మంచులా కరుగుతాయి.నీ సంకల్పమే నిన్ను విజయతీరాలకు చేర్చుతుంది.కదిలేనదికిఅడ్డుకట్టలు ఎదురైతేకదలి చేరే వరకు ఆది ఆగదుపట్టుదలే నీ ఆయుధం కావాలి. లక్ష్యసాధనేనీధ్యేయమైతే గమ్యం నీదే గెలుపు నీదే ఏదైనా సాధించే వరకుఅది అసాధ్యమనిపిస్తుంది. నీగమ్యంపై నీకు నమ్మకంఉంటే ఎంతటి కష్టమైనా గెలుపుగా మారుతుంది అన్న నెల్సన్ మండేలా వాఖ్య యువతరానికి కరదీపిక కావాలి.నిరంతర శ్రమయే నీ మార్గం కావాలిఅప్పుడే ప్రగతి నీ చెంతకు చేరుతుందినీ పురోగతి సమాజానికి స్ఫూర్తి అవుతుంది.లే సాగిపో విజయ తీరం వైపు పరిమితులను దాటి కొత్త చరిత్రను సృష్టించాలి.నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం రచయిత కాలమిస్ట్ కరీంనగర్.



# నంద్యాలలో జర్నలిస్టుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి. కాంగ్రెస్ పార్టీ డిమాండ్.

**● అర్ధరాత్రి దొంగలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు అరెస్టును ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి. ● అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లాలో ఐ న్యూస్ రిపోర్టర్స్ ని అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్లి దొంగలను అరెస్టు చేసినట్లుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, , జిల్లా ఉపాధ్యక్షుడు సలాం,కుమార్ పుష్పరాజు నంద్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో మంత్రి ఫరూక్ కుమారుల మీద షాడో మంత్రులు అంటూ వార్తలు ప్రసారం చేసారని అనుచరులు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి సమయంలో ఉగ్రవాదులను,దొంగలను అరెస్ట్ చేసినట్లుగా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురయ్యే విధంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యనికి మూల స్తంభమైన ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా ప్రతినిధులను పూర్తిగా ఇబ్బందులు గురి చేసే విధంగా పోలీస్ చర్యలను వారు తప్పు పట్టారు పత్రికా స్వేచ్ఛను మీడియా స్వేచ్ఛను హరించే చేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్



విధంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఏమైనా తప్పుడు కథనాలని ప్రసారం చేస్తే ప్రజాస్వామ్య బద్ధంగా డెఫినేషన్ వేయొచ్చు కానీ వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ కుమారులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు ఇస్తే.. న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి అక్రమ కేసులు పెట్టి జర్నలిస్టులను లొంగదీసుకోవాలని చూస్తే అది కుదరదని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.నంద్యాల టూ టౌన్ పోలీసులు దౌర్జన్యం బసవరాజు, రిపోర్టర్స్ పై బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. అంతటితో ఆగకుండా రిపోర్టర్స్ పై నాన్ బెయిల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. రిపోర్టర్ల పై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టులందరిని కలుపుకొని ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

ప్రభుత్వానికి ప్రజలకు వాడిదిగా నిలిచే మీడియాపై కక్షకట్టడం అనైతికం తక్షణమే అరక్షేసిన మీడియా ప్రతినిధులను ప్రభుత్వం విడుదల చేయాలని వారిపై పెట్టిన కేసులను ప్రభుత్వం ఉప్పరించుకోవాలని అన్నారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు తక్షణమే ఎత్తివేయాలి

**☛నోటీసులు లేకుండా అర్ధరాత్రి ఐన్యూస్ రిపోర్టర్ల అరెస్టు దారుణం.**

**?☛సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు .**




పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలో ఐన్యూస్ జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ●ఎన్. రంగా నాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. ముందస్తు నోటీసులు లేకుండా సురేష్ కుమార్, నాగ చంద్రుడులను అర్ధరాత్రి వేళ దొంగల మాదిరిగా ఇళ్లకు వెళ్లి అరెస్టు చేయడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఖండించారు.

రాష్ట్ర ?న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలోనే పత్రికా స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుంటే బాధితులకు న్యాయం జరిగేనా అని ప్రశ్నించారు. మంత్రి కుమారులు భూముల ఆక్రమణలు, మట్టి తవ్వకాల అక్రమాలకు పాల్పడుతున్నారనే వార్తలపై కక్షసాధింపుతోనే ఈ కేసులు పెట్టారన్నారు. కథనాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా నోటీసులు ఇవ్వాలి తప్ప, వార్తలు వెనక్కి తీసుకోవాలని బెదిరించడం సరికాదన్నారు. మాట వినకపోవడంతో టూటౌన్ పోలీసులు నాన్-బెయిలబుల్ కేసులు బనాయించి దౌర్జన్యానికి దిగారని మండిపడ్డారు. ఐన్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజుతో పాటు ఇతర విలేకరులను బెదిరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. తక్షణమే అక్రమ కేసులను ఉపసంహరించుకోకపోతే జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులతో కలసి సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# బాలికల ఆరోగ్యం కోసం కేజీబీవీలో ప్రత్యేక చర్యలు

విద్యార్థినుల ఆరోగ్యం, ఆత్మవిశ్వాసానికి చేయూత





హోళగుంద పల్లె వెలుగు సెప్టెంబర్ : 08 బాలికల్లో రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన పెంపొందించి, వారి ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కర్నూలు జిల్లాలోని కేజీబీవీ హోళగుంద పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. లెర్నింగ్ కర్వ్ మరియు యాక్సిస్ ఎనర్జీ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలకు 12 నెలలకు సరిపడా పరిశుభ్రత ప్యాడ్‌లను అందజేశారు. అలాగే ఉపయోగించిన ప్యాడ్‌లను సురక్షితంగా నిర్వీర్యం చేసేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థినుల శారీరక వికాసం కోసం క్రీడా సామగ్రిని అందించారు

ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు, సంబంధిత సంస్థల ప్రతినిధులు, కేజీబీవీ ప్రత్యేకాధికారి శ్రీమతి దివ్య భారతి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాలికల జీవితంలో రుతుక్రమ పరిశుభ్రత ఎంతో ముఖ్యమైన అంశమని తెలిపారు. సరైన అవగాహన, పరిశుభ్రత పాటించడం ద్వారా బాలికలు ఆరోగ్యంగా ఉండగలరన్నారు. ఇటువంటి కార్యక్రమాలు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి పాఠశాల హాజరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బాలికలకు ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, భద్రత, గౌరవంతో కూడిన వాతావరణాన్ని కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పాఠశాలలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# పరుగుల పండుగకు తెరలేపిన అథ్లెటిక్స్ పోటీలు.

- జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు 1,200 మంది అథ్లెట్లు హాజరు
- క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను స్వీకరించాలి మారుతి నాయుడు.

ఆదోని (పల్లె వెలుగు): క్రీడా ప్రతిభకు వేదికగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీలకు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి సుమారు 1,200 మంది అండర్--14, అండర్--16, అండర్--18, అండర్--20 బాలబాలికల అథ్లెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు పోటీపడ్డారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకోనున్నారు.

**క్రీడల్లో గెలుపోటములు సహజం**

ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్, టీడీపీ యువ నాయకుడు మారుతి నాయుడు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఫలితాలను అన్నారు. క్రీడాకారులు కష్టపడి సాధన చేసి జిల్లా,






రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి తమ తల్లిదండ్రులకు, గురువులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆదోని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ అయ్యప్ప, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మాజీ కర్నూలు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి హర్షవర్ధన్, పెద్దకడబూరు మండల ఎంఈఓ--2

సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడతాయని

రామమూర్తి, ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎర్రిస్వామి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. క్రీడలే యువతకు ఆరోగ్యం.. క్రమశిక్షణ.. విజయానికి బాట!

# పింఛన్ కోసం పడిగాపులు.. నిబంధనలతో పేదలకు తిప్పలు!

- పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.
- గడువు ఈనెల 31 వరకు పొడిగించాలి సీపీఎం డిమాండ్.
- లేకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన హెచ్చరిక.

ఆదోని (పల్లె వెలుగు): కొత్త పింఛన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం కల్పించిన అవకాశం కఠిన నిబంధనల కారణంగా ఇబ్బందుల పాలవుతున్నారని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో అవసరమైన పత్రాల కోసం పేదలు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరగాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా నిబంధనలను సరళీకరించడంతో పాటు దరఖాస్తుల గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు.

సీపీఎం ఆదోని పట్టణ జనరల్ బాడీ సమావేశం సుందరయ్య భవన్‌లో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్. రాధాకృష్ణ, కే. వెంకటేశులు, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు.

కొత్త పింఛన్ల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పేదలకు దరఖాస్తు చేసుకునే అవకాశం రావడంతో సంతోషం కలిగిందని.. అయితే నిబంధనలు, పత్రాల భారంతో ఆ ఆనందం ఆవిరైందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే ఉద్దేశంతో కాకుండా, లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే విధంగా నిబంధనలు రూపొందించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు.

దరఖాస్తు ప్రక్రియలో పలు రకాల ధ్రువపత్రాలు సాధ్యం కాదని తెలిపారు.





**గడువు పెంచకపోతే ఆందోళన**

ప్రభుత్వం ప్రకటించిన గడువును ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

తప్పనిసరి చేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక్క పత్రం లోపించినా ఆన్‌లైన్ దరఖాస్తు ముందుకు సాగకపోవడం, సర్వర్ సమస్యలు, ఓటీపీ ఇబ్బందులు దరఖాస్తుదారులకు మరింత తలనొప్పిగా మారాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరిగా జీవించే మహిళలు అవసరమైన పత్రాల కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. తక్కువ వ్యవధిలో అన్ని పత్రాలు సమకూర్చుకొని దరఖాస్తు చేసుకోవడం వారికి

దరఖాస్తు ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పింఛన్ల దరఖాస్తు గడువును 31వ తేదీ వరకు పొడిగించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆదోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కన్న, తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, వెంకటేష్, కృష్ణమూర్తి, నాగేంద్ర, మక్బూల్ బాను, నాయకులు మల్లయ్య, మోహన్, సంజయ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహనే.. హక్కులకు రక్షణ!

- బదినేహాళ్‌లో ఘనంగా జాతీయ అక్షరాస్యత దినోత్సవం.
- ప్రజలకు న్యాయ విజ్ఞానంపై అవగాహన సదస్సు.



ఆదోని (పల్లె వెలుగు): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని, తమ హక్కులను తెలుసుకొని న్యాయపరమైన సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని వక్తలు సూచించారు. జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బదినేహాళ్ గ్రామంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టంలో కల్పించిన వివిధ అవకాశాలు, హక్కులు, న్యాయ సహాయ సేవలు, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న మార్గాలను వివరించారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారు న్యాయం కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు నామినేటెడ్ సభ్యులు లోకేష్ కుమార్, న్యాయవాది సుబ్బన్న, కోనేరు ఎన్జీవో సంఘం ప్రతినిధి వీరన్న, గ్రామ పెద్దలు చిన్న, రమేష్, మేరీ, కుసుమ, కోర్టు ఉద్యోగి సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. చట్టంపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది తమకు ఉన్న హక్కులను, న్యాయపరమైన అవకాశాలను వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయ విజ్ఞానాన్ని చేరువ చేయడమే ఇటువంటి అవగాహన సదస్సుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన గ్రామ ప్రజలకు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు న్యాయపరమైన అంశాలపై నిరంతరం అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ్ మాసం 2026 కార్యక్రమాలు : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న 9వ జాతీయ "పోషణ్ మాసం--2026" కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు "మన అంగన్వాడీ -- మన బాధ్యత" అనే ప్రధాన థీమ్ పై జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్ పి డి లీలావతి దేవి, సంబంధిత అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు.





జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.."మన అంగన్వాడీ -- మన బాధ్యత" అనే ప్రధాన థీమ్ కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఆహారం, బాలల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో వంటకాల ప్రదర్శనలు, అంగన్వాడీ కేంద్రాల్లో తాజా, వేడి మరియు సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిటీ టేస్ట్ టెస్టింగ్ కార్యక్రమాలు. అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీలు, గ్రామసభలు, సోషల్ ఆడిట్ ద్వారా ప్రజల భాగస్వామ్యం, 0--3 సంవత్సరాల పిల్లల ఎదుగుదల, అభివృద్ధి పర్యవేక్షణ,
చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు, ఈ సి సి ఈ కార్యక్రమాల నిర్వహణ.
ప్రధానమంత్రి మాతృ వందన యోజన పై అవగాహన, అర్హులైన లబ్ధిదారుల నమోదు చేయాలన్నారు. పోషణ వాటికల సందర్శనలు, పోషణ్ మేళాలు, ప్రజలకు ఆచరణాత్మక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్య, వ్యవసాయం, ఉద్యానవన, ఎస్ ఇ ఆర్ పి తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల వివరాలను జన్ ఆందోళన్ డ్యాష్‌బోర్డ్ మరియు పోషణ్ ట్రాకర్ ద్వారా నమోదు చేయనున్నారు. జిల్లాలోని ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని "మన అంగన్వాడీ -- మన బాధ్యత" అనే స్ఫూర్తితో పోషణ్ మాసం కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు.

# నిరాధార ఆరోపణలకు ఆధారాలు చూపాలి

లేదంటే చట్టపరంగా సమాధానం ఇస్తాం: టీడీపీ నేత చంద్రశేఖర్







ఎమ్మిగనూరు, పల్లె వెలుగు సెప్టెంబర్ 8: తనపై ఓ దినపత్రికలో ప్రచురితమైన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ల చంద్రశేఖర్ ఖండించారు. తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిర్గతం చేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన పుట్టినరోజు కార్యక్రమాన్ని రాజకీయ గ్రూపు వివాదంగా చిత్రీకరించడం సరికాదన్నారు. టీడీపీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి పనిచేస్తున్నానని తెలిపారు. రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలకే పరిమితం కావాలని సూచించారు.

# గందం ఉరుసు సందర్భంగా భక్తులకు ఉచిత తాగునీరు, వైద్య సేవలు

హోళగుంద పల్లె వెలుగు సెప్టెంబర్ : 08 ఎల్లార్తి గ్రామంలోని హజరత్ షేక్షావలి సాహెబ్,






హజరత్ షాషావలి సాహెబ్ దర్గాలో జరుగుతున్న గందం ఉరుసు సందర్భంగా భక్తుల కోసం ఎస్ఎస్వీ ఆధ్వర్యంలో ఉచిత తాగునీటి పంపిణీతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దర్గాకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో వారి సౌకర్యార్థం ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కే. గిరి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం గందం ఉరుసుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండు రోజుల పాటు ఉచిత తాగునీరు, ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు సేవ చేయడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు ఈరన్న, వైద్య సిబ్బంది డాక్టర్ సునీల్, గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై కర్నూలు ట్రాఫిక్ పోలీసుల కొరడా

**రాజ్‌విహార్ కూడలిలో తనిఖీలు... 18 మంది మైనర్ల పట్టివేత**

**తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్, ఈ-చలానాల విధింపు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తే తల్లిదండ్రులపై



చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని ప్రముఖ రాజ్‌విహార్ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మోటార్ సైకిళ్లు నడుపుతూ నిబంధనలు ఉల్లంఘించిన 18



మంది మైనర్లను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారి తల్లిదండ్రులను రప్పించారు. సీఐ సమక్షంలో మైనర్లకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణాపాయం కలగడమే కాకుండా పిల్లల బంగారు భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలకు జరిమానాలు (చలాన్లు) విధించారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.


## గాజులపల్లెలో భారీ అగ్ని ప్రమాదం

**-సర్వం కోల్పోయామంటూ బాధితులు ఆవేదన**

**-లక్షల్లో తీవ్ర నష్టం..**

మహానంది, పల్లె వెలుగు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ సర్క్యూట్ తో రాజు బైక్ మెకానిక్





షాప్ దగ్ధమైన ఘటన మంగళవారం అర్ధరాత్రి మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాజు అనే వ్యక్తికి గాజులపల్లె మెట్టలో బైక్ మెకానిక్, స్పేర్ పార్ట్స్ షాపు ఉందన్నారు. రాత్రి ఎప్పటిలాగే షాపు మూసివేసి



వెళ్లారన్నారు. అర్ధరాత్రి సమయంలో షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి అన్నారు. స్థానికులు, చుట్టుపక్కల వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన ఫలితం లేదన్నారు. అప్పటికే షాపులోని 8 బైకులు, స్పేర్ పార్ట్స్, ఆయిల్ క్యాన్లు కాలిపోయాయని తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా బైక్ మెకానిక్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తూ వస్తున్నామన్నారు. ఈ అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయామని వాపోయారు.

# ప్రజా వ్యతిరేక నిర్ణయాల రద్దు కోరుతూ అఖిలపక్షం చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల స్వచ్ఛంద మద్దతు.

**☛125 ఏళ్ల చరిత్ర గల ఆర్ ఏ ఆర్ ఎస్ ను కాపాడండి... రైతు ప్రయోజనాలను పరిరక్షించండి**


**☛అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపు.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సమస్యలపై అవగాహన పెంచుకున్న ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేశారు.

సెప్టెంబర్ 2న ప్రారంభమైన ఈ ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 8న నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి పప్పుల బజారు, రెడ్డి చావడి, సిమెంట్ రోడ్డు మీదుగా మెయిన్ బజార్ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలకు రెండు సమస్యలపై అవగాహన కల్పించగా, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పోస్టుకార్డులు రాసి పోస్టుబాక్సుల్లో వేశారు.

ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, దాదాపు 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ ఏ ఆర్ ఎస్ వ్యవసాయ పరిశోధనలకు కీలకమైన సంస్థ అని తెలిపారు. ముఖ్యంగా విత్తన పరిశోధన, వ్యవసాయ సాంకేతిక అభివృద్ధి, రైతులకు ఉపయోగపడే పరిశోధనలకు ఇలాంటి సంస్థలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అటువంటి పరిశోధనా సంస్థ ప్రాంగణంలో



తాత్కాలిక కలెక్టరేట్ ఏర్పాటు చేయడం వల్ల పరిశోధన కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోందని, కలెక్టరేట్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

అలాగే రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ఈ స్థల కేటాయింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు.

రైతు నష్టపోతే నష్టపోయేది రైతు ఒక్కరే కాదని, రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిపైనే సమాజ ఆహార భద్రత ఆధారపడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. అందువల్ల వ్యవసాయ పరిశోధనా సంస్థలను పరిరక్షించడం, రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన మార్కెట్ యార్డులను కాపాడటం ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ రెండు సమస్యలపై ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేయడం, ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడి పెంచి ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయాలను ఉపసంహరించేలా చేయడం పోస్టుకార్డు ఉద్యమం ప్రధాన లక్ష్యమని అఖిలపక్ష నాయకులు తెలిపారు.

పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం, సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.

అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు ఏర్వ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కో-కన్వీనర్లు ఎజాస్, జానయ్య, చిన్న రామకృష్ణ రెడ్డి, అడ్వకేట్ శంకరయ్య, యర్రం శంకర్ రెడ్డి, విద్యార్థి నాయకుడు రాంబాబు, చౌడప్ప, చింతలయ్య, అడ్వకేట్ నాగేశ్వరరెడ్డి, పట్నం రాముడు, రామ్మోహన్ రెడ్డి, మోహన్ బాబు, షణ్ముఖరావు, మజీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ఊబిలో బండి ఆత్మకూరు పంచాయతీ


బండి ఆత్మకూరు పల్లె వెలుగు సెప్టెంబర్ 8: బండి




ఆత్మకూరు గ్రామపంచాయతీ నిర్వహణ విషయంలో రాజకీయ నాయకుల జోక్యం మితిమీరి పోవడంతో ప్రస్తుతం పంచాయతీ నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిడులకు కొందరు అధికారులు కూడా వంత పాడుతూ ఉండటంతో పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఏ గ్రామ పంచాయతీలోనూ వర్కర్లు లేనివిధంగా బండి ఆత్మకూరు గ్రామపంచాయతీలో నలుగురు వాటర్మెన్ లు పనిచేస్తున్నారు. గతంలో పంచాయతీలో ఒక్కరే వాటర్ మెన్ ఉండగా ప్రస్తుతం ఒక్కొక్క ట్యాంక్ కు ఒక వాటర్ మాన్ పనిచేస్తున్నారు. రాజకీయ నాయకుల సిఫారసులతో ఒకరిద్దరూ ఉండాల్సిన వాటర్ మెన్ ల సంఖ్య నాలుగు చేరుకుంది. ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జీతం చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు స్వచ్ఛభారత్లో డంపింగ్ యార్డ్ లో చెత్త ను సేకరించేందుకుగాను ట్రాక్టర్ డ్రైవర్ను రాజకీయ సిఫారసుతోనే నియమించారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా బండి ఆత్మకూరులోని రెండు సచివాలయాల్లోనూ రెండు సంవత్సరాల క్రితం రాజకీయ నాయకుల సిఫారసుతో ఇరువురు స్వీపర్ ల ను నియమించారు. ఈ లెక్కన నలుగురు వాటర్ మెన్ లకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున 40 వేలు, ట్రాక్టర్ డ్రైవర్ కు 8000, సచివాలయ స్వీ ఫరులకు ఒక్కొక్కరికి 6000 చొప్పున 12000 పంచాయతీ చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన మొత్తం సిబ్బందికి నెలకు 60 వేల రూపాయలను చెల్లించాల్సి ఉంది. సిఫారసు చేసి పోస్టులను అయితే సృష్టించారు కానీ, వీరికి పంచాయతీ బోర్డు జీతాలు ఎలా తెలుస్తుంది అన్న విషయాన్ని మాత్రం రాజకీయ నాయకులు విస్మరించారు. సిబ్బంది అందరికీ ఏడాదికి 7 లక్షల 20వేల రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. 2022-23 నాటికి ఇంటి పన్నులు, నీటి పన్నులు, వేలం పాటలకు సంబంధించి ఆరు లక్షల 50 వేల రూపాయల ఆదాయం మాత్రమే వస్తుంది. పంచాయతీకి ఏడాది ఆదాయం ఆరు లక్షల 50 వేల రూపాయలు వస్తుంటే మరి పంచాయతీ సిబ్బందికి ఏడు లక్షల 20వేల రూపాయలను జీతాల క్రింద ఎలా చెల్లిస్తున్నారన్నది లోగుట్టు పెరుమాళ్ళ కెరుక అన్న రీతిలో సాగుతూ ఉంది. 2024-25 నుండి ఇంటి పన్నులు నీటి పనుల విషయంపై ప్రభుత్వం ఆన్లైన్ సిస్టం ప్రవేశపెట్టడంతో, ఏడాదికి ఆరు లక్షల 50 వేల రూపాయల ఉన్న ఆదాయం 11 లక్షల మేరకు పెరిగింది. పంచాయతీకి వచ్చే ఆదాయంలో 50 శాతానికి మించి సిబ్బందికి జీతాలను చెల్లించకూడదు అన్న నిబంధనలు ఉన్నప్పటికీ, పంచాయతీ అధికారులు ఈ విషయంలో ఏ విధంగా నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. 2025 నుండి పంచాయతీ ఆదాయం పెరిగినప్పటికీ, ఆదాయం తక్కువ, వర్కర్లు ఎక్కువ అనే రీతిలో నిర్వహణ సాగుతూ ఉంది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వాటర్ మెన్ ల కాల పరిమితి ఈ ఏడాది జూన్ నాటికి ముగిసింది. అప్పటికే నాలుగు నెలల జీతాలను వాటర్ మెన్ లకు చెల్లించాల్సి ఉంది. జూన్ తర్వాత కాల పరిమితి అయిపోయి మూడు నెలలు కావస్తున్నప్పటికీ, ఈ లెక్కన ఏడు నెలల జీతాలను వాటర్ మెన్ల కు చెల్లించాల్సి ఉంది. జీతాల చెల్లింపు విషయంలో పంచాయతీ కారులు తలలు పట్టుకుంటూ, కాంట్రాక్టు పద్ధతిలో వీరిని కొనసాగించేలా ప్రతిపాదనలు పంపేందుకు అధికారులు వెనుకడు వేసే పరిస్థితి నెలకొని ఉంది. జీతాల చెల్లింపు విషయంలో పంచాయతీ సిబ్బంది రెండు రోజుల క్రితమే ఆత్మకూరు డి ఎల్ డి ఓ ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచుకొని జీతాలను తీసుకోమని డి ఎల్ డి ఓ చెప్పినట్లుగా తెలుస్తోంది. బండి ఆత్మకూరులో దాదాపు 1600 నీటి కొళాయి కనెక్షన్లు ఉండగా, 1000 కులాయి కనెక్షన్లకు మాత్రమే నీటి పన్నులను వసూలు చేశారు. మిగతా 600 కులాయి కనెక్షన్లకు సంబంధించి నీటి పనులను వసూలు చేయడంలో కొందరు వాటర్ మెన్ లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 600 కులాయి కనెక్షన్లకు సంబంధించి నీటి పన్నులు వసూలు చేస్తే, వాటర్ మెన్లకు జీతాలు అందే అవకాశం ఉంది. పంచాయతీ నిర్వహణలో రాజకీయ జోక్యం మితిమీరిన కారణంతో పంచాయతీ అధికారుల పనితీరు ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లుగా మారింది.

## ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

పోరుమామిళ్ల సెప్టెంబర్ 8 : (పల్లె వెలుగు):ఓటర్ల జాబితా సవరణ, మ్యాపింగ్, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియలను పూర్తిచేసి, తుది ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 నాటి ఓటర్ల జాబితాలో మ్యాపింగ్‌కు సంబంధించి పలువురికి నోటీసులు జారీ చేయడం, విచారణకు హాజరు కాకపోతే ఓట్లు తొలగిస్తామని బెదిరింపులు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. రేషనలైజేషన్ పేరుతో పోలింగ్ బూత్‌లను ఇష్టారాజ్యంగా మారుస్తున్నారని, ఫారం-8 ద్వారా ఓటర్ల కుటుంబాలను వేర్వేరు పోలింగ్ బూత్‌లకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా పోలింగ్ బూత్‌ల మార్పులు జరుగుతున్నాయని, ఎన్నికల యంత్రాంగం అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేస్తోందనే ఆరోపణలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని నాగార్జున రెడ్డి అన్నారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయి, తుది జాబితా ప్రకటించే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రక్రియపై అనేక సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ఎన్నికల సంఘం తీరుపై ప్రజల్లో మరిన్ని అనుమానాలు పెరిగే అవకాశం ఉందని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు.

